క్లుప్తంగా

రైతులకు న్యాయం చేయాలి



సిరికొండ: సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యంతో రుణమాఫీ పొందలేకపోతున్న రైతులకు న్యాయం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల రుణమాఫీ విషయంలో నిర్లక్ష్యం వహించిన సొసైటీ సిబ్బందిపై అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు దామోదర్, అనీస్, ఆశిష్ పాల్గొన్నారు.

‘స్థానికం’లో సత్తాచాటాలి



ఇందల్వాయి: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని, ఇందు కోసం తగిన కార్యాచరణ రూపొందించాలని పార్టీ మండల అధ్యక్షుడు నాయిడి రాజన్న అన్నారు. మండలకేంద్రంలో సోమవారం బీజేపీ బూత్ లెవెల్ కమిటీలు, శక్తి కేంద్రాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు బూత్‌స్థాయి నుంచి కార్యకర్తలను సమయాత్తం చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని తీర్మానించారు. కన్నెచిన్ను, ప్రదీప్‌రెడ్డి, మోహన్ రెడ్డి, శ్రావణ్, శేఖర్, జగత్‌సింగ్, శ్రీకాంత్ ఉన్నారు.

పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీలోకి తీసుకురావాలి



ఖలీల్‌వాడి: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా తీసుకువచ్చిన జీఎస్టీలోకి పెట్రోల్, డీజిల్‌ను కూడా చేర్చాలని ఇందూర్ వినియోగదారుల సంక్షేమ కమిటీ అధ్యక్షుడు పెందోని అనిల్‌కుమార్ కోరారు. నగరంలోని ఆర్యనగర్‌లో సోమవారం ఇందూరు వినియోగదారుల సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఒకే పన్ను విధానం అమలులో ఉండాలని జీఎస్టీని తీసుకురావడంతో రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలకు వర్తింప చేయడం లేదన్నారు. సెప్టెంబర్‌లో జరిగే వినియోగదారుల జాతీయ సమావేశాల్లో ఈవిషయమై తీర్మానం ఆమోదం కోసం ప్రయత్నిస్తామని తెలిపారు. కమిటీ ప్రతినిధులు ప్రవీణ్, వర్మ, గైని రత్నయ్య, మహాదేవుని శ్రీనివాస్, రవికుమార్, సాయిరెడ్డి, బానోత్ సందీప్, ప్రవళికగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా బీటీఏ దినోత్సవం



నిజామాబాద్‌అర్బన్: నగరంలో సోమవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ 24వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలాంగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి బీటీఏ నాయకులు పూలమాల వేశారు. బీటీఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్‌నాయక్ మాట్లాడుతూ.. బహుజన ఉపాధ్యాయుల హక్కుల కోసం, సామాజిక చైతన్య బాధ్యతను తెలుపుతూ సమాజ వివక్షతపై పోరాటం చేస్తున్నమన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయిలు, స్వామినాయక్, జిల్లా బాధ్యులు ప్రభాకర్, ప్రకాష్‌పవార్, శంకర్, భీముడు, యాకూబ్ అలీ అన్సారి పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో విద్యాసంస్థలు నడపడం సరికాదు

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సెలవు రోజుల్లో కూడా విద్యాసంస్థలను నడపడం సరికాదని ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ పేర్కొన్నారు. నగరంలోని పలు కళాశాలలు సోమవారం సెలవు రోజున నడుపుతుండటంతో వాటిని బంద్ చేయించినట్లు తెలిపారు. సెలవు రోజుల్లో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ, విద్యాసంస్థలను నడుపుతున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బాలకృష్ణ, గోపి, దుర్గాదాస్, గణేష్, మహేష్, హర్ష, లక్కీ, శశాంక్, శివ, రాజు, మోహన్, చక్రదీప్, భువన్, అర్షిత్ పాల్గొన్నారు.

‘ఛలో అసెంబ్లీ’ ముట్టడిని జయప్రదం చేయాలి

నిజామాబాద్‌అర్బన్: ఈనెల 31న పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ‘ఛలో అసెంబ్లీ’ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం విదార్థులు, యువతకు పిలుపునిచ్చారు. నగరంలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నాయకులు ప్రిన్స్, నర్సయ్య, భాస్కర్, నిఖిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్‌లో సౌకర్యాల లేమి

- వైద్యుల కొరత.. ఇరుకు గదుల్లో సేవలు
- రిటైర్డు ఎంప్లాయీస్, ఉద్యోగ, ఉపాధ్యాయ, జర్నలిస్టులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారుల



వెల్‌నెస్ సెంటర్‌లో ఒక గదిలోనే ఏర్పాటు చేసిన మందుల స్టోరేజ, ఫార్మసీ



వెల్‌నెస్ సెంటర్ బయట మందుల కోసం క్యూలో ఉన్న రోగులు (ఫైల్)

నిజామాబాద్ నాగారం: రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులు, ఉద్యోగులు తదితరులకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిజామాబాద్ నగరంలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ మరీ ఇరుకుగా మారింది. ఒకే ఒక్క హాలులో ఫార్మసి, స్టోర్ రూమ్‌తో పాటు వైద్య సేవలు కూడా అందిస్తున్నారు. స్పెషలిస్టు డాక్టర్లు ఉండాల్సి ఉన్నా.. కేవలం ఎంబీబీఎస్ వైద్యులతోనే తూతూ మంత్రంగా నడిపిస్తున్నారు. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వెల్‌నెస్ సెంటర్ సేవలు అందుతున్నాయి. ఉభయ జిల్లాలకు సంబంధించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులకు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు వేలాదిమందికి ఉపయోగపడుతున్న వెలెనెస్ సెంటర్‌కు వసతి కరువైంది. ఒకే రూములో డాక్టర్లు, మందులు ఇవ్వడం, రిజిస్ట్రేషన్, లబ్ధిదారులు కూర్చునేందుకు, తదితర పనులు ఒకే చోట నిర్వహించటం చాలా ఇబ్బందిగా మారింది. పేషెంట్లు వైద్య సేవలు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది కూర్చునేందుకు కూడా స్థలం లేక సగం మంది బయటే కూర్చోవడం లేదా తిరగటం జరుగుతోంది.

స్పెషలిస్ట్ డాక్టర్లు ఎక్కడ?

నిబంధనల ప్రకారం వెల్‌నెస్ సెంటర్‌లో అవుట్ పేషెంట్ సేవల గురించి స్పెషలిస్ట్ డాక్టర్లు ఉండాలి. కార్డియాలజీ, ఆర్థో, గైనకాలజీ, న్యూరో, చిల్డ్రన్ స్పెషలిస్ట్ తదితరులతో పాటుగా ఎంబీబీఎస్ డాక్టర్లు ఉండాలి. కానీ ఒక్క డాక్టర్‌తోనే వందలాది మందికి సేవలు అందిస్తున్నారు. డెంటల్ ఎక్విప్మెంట్, కుర్చీలు, అన్ని మూటగట్టి మూలనపడేశారు. దీనితో డెంటల్ డాక్టర్లకు పని లేకుండా పోయింది. ఫిజియోథెరపీకి సంబంధించిన ఎక్విప్మెంట్ కూడా మూలన పడింది. ఈసీజీ పరిస్థితి కూడా అంతే. ఖరీదైన మందులు నిల్వ ఉంచడానికి అవకాశం లేకుండా పోయింది. మందులన్నీ ఎండకి ఎండుతున్నాయి. నిర్దేశించిన టెంపరేచర్‌లో మందులు ఉండాలి. పేషెంట్లు, రిటైర్డ్ ఉద్యోగులు కూడా ఎండలోనే క్యూలో నిల్చుని మందులు తీసుకుంటున్నారు. ఇప్పుడు వర్షాకాలం వానలకు తడుస్తూ సేవలు పొందాల్సి వస్తోంది. డాక్టర్లు లేరు కానీ నాలుగో తరగతి సిబ్బంది మాత్రం పదుల సంఖ్యలో ఉన్నారు .

కమిషనర్ పర్యటించినా అంతే!

ఇటీవల మున్సిపల్ కమిషనర్ మంద మకరందు వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. ఎలాంటి సేవలు అందుతున్నాయో వైద్యులు, రిటైర్డు ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా మార్పు జరుగుతుందోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. సమస్యలతో ఇబ్బందులు కలుగుతున్న విషయాన్ని కమిషనర్ పరిశీలించడంతో న్యాయం జరుగుతుందని చూస్తున్నారు.

వసతి కల్పించాలి



పెన్షనర్లకు, ఉద్యోగులకు, ఉపయోగపడుతున్న వెల్‌నెస్ సెంటర్ గురించి అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరం. వర్షాకాలంలో పేషెంట్లకు తలదాచుకోవటానికి కూడా అవకాశం లేకుండా పోయింది. స్వయానా మున్సిపల్ కమిషనర్ వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించి గాలి కూడా సరిగా ఆడని పరిస్థితుల్లో ఎలా ఉంటున్నారు అని ప్రశ్నించారు. టాయిలెట్లు, బాత్రూములు కూడా సక్రమంగా లేవు. అదనపు వసతి, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాము.

– కె. రామ్మోహన్‌రావు, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్

నేటి చిత్రం..



నగరంలోని వర్ని చౌరస్తాలో కుక్కల సంచారం

కుక్కల బెడదను నివారించండి

నగరంలోని వర్ని రోడ్డులో కుక్కలు బెడద ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. రాత్రివేళలో బయటకు వెళ్లాలంటే కుక్కలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలు బెడదను నివారించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

అన్నదాతలు ఆందోళన చెందవద్దు

- అర్హులైనవారికి రూ.2లక్షల రుణమాఫీ
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



డిచ్‌పల్లి: సాంకేతిక కారణాల వల్ల ఇప్పటివరకు రూ.లక్ష వరకు రుణమాఫీ రాని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. కుటుంబం యూనిట్‌గా అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు ఈ నెల 18న లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేసిందన్నారు. అలాగే మంగళవారం (30న) మధ్యాహ్నం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రూ.లక్షా 50వేలు రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 వరకు రూ.2లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తారని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాని వారికి ఎమ్మెల్యేగా భరోసా ఇస్తున్నానని, సంబంధిత ఏఈవోలకు బాధ్యతలు అప్పగించామన్నారు. రైతులు ఆధార్‌కార్డు, ఇతర వివరాలతో ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. రూ.లక్షా 50వేలు రుణమాఫీ సందర్భంగా జిల్లాలోని రైతులందరికీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఖలీల్‌వాడి: ఖమ్మంలో ఇటీవల ఏర్పాటుచేసిన అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ సర్వసభ్య సమావేశంలో జాతీయ కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, కేరళతోపాటు ఆంధ్రప్రదేశ్ నుంచి సభ్యులు పాల్గొన్నారు. ఇందులో సభ జాతీయ కార్యదర్శిగా బోధన్‌కు చెందిన కర్కా సిద్దు, కోశాధికారిగా నగరానికి చెందిన మూడ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఇంజనీర్ గంగాధర్ గురుస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎనిమేలి దగ్గరలో గల నారాయణ తోడులో శబరిమల సీజన్, నెల పూజ సమయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు కోసం శాశ్వత ప్రాతిపదికన అన్నదాన కేంద్రాన్ని నిర్మించనున్నట్లు తెలియజేశారు. నేషనల్ వెబ్ మాస్టర్ మాడవేడి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు మక్తల్ మల్లేష్, కార్యదర్శి వంశీధర్ చౌదరి, కోశాధికారి గంగోని మధు, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్, వలంటరీ కమాండెంట్ రతన్ గురుస్వామి, కార్యవర్గ సభ్యుడు సంజీవ్, శంకర్ పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు



కంకర తేలిన దూస్‌గాం-ముల్లంగి (బి) రోడ్డు



వర్షాలకు బురదమయంగా మారిన రహదారి

డిచ్‌పల్లి: మండలంలోని దూస్‌గాం సబ్‌స్టేషన్ నుంచి ముల్లంగి (బి)గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా కంకర తేలి అధ్వానంగా మారింది. సుమారు రెండున్నర కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డుపై కంకర తేలడంతోపాటు గుంతలు పడి బురదమయంగా మారింది. దీంతో ఈ మార్గంలో వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. రాత్రిళ్లు ద్విచక్రవాహనదారులు గుంతల్లో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యను అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై దిగబడిన లారీ



ఇందల్వాయి: మండలంలోని వెంగల్‌పాడ్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డుపై సోమవారం లారీ దిగబడిపోయింది. దీంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇందల్వాయి-ధర్పల్లి రోడ్డు మార్గంలోని వెంగల్‌పాడ్ వద్ద ఇటీవల హై లెవెల్ వంతెన పనులు ప్రారంభించారు. కానీ వాహనాల రాకపోకల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డు నాసిరకంగా వేశారు. వర్షాలకు రోడ్డు బురదమయంగా మారడంతో పాటు భారీ వాహనాలు వస్తే గుంతల్లో దిగబడిపోతున్నాయి. దీంతో ఈ రోడ్డుపై తరచూ ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడుతుంది. వంతెన పనులు పూర్తవడానికి ఇంకా సమయం ఉండటంతో తాత్కాలిక రోడ్డుని పటిష్టం చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెండ్

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి, త్రయంబక్‌పేట్ గ్రామాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఆరేటి రఘుని తాత్కాలింగా విధులనుంచి తొలగించినట్లు ఎంపీడీవో అనంత్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన రఘుపై కూలీలకు అందుబాటులో ఉండటం లేదని, వనమహోత్సవ కార్యక్రమంలో విఫలం, సమీక్ష సమావేశాలకు హాజరు కాకపోవడం వంటి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి ఆదేశాల మేరకు రఘుని విధుల నుంచి తప్పించినట్లు ఎంపీడీవో తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	రాయన్ (తెలుగు) - 10.45 1.35 4.30 7.25 10.20
స్క్రీన్-2	కల్కి 2898 2డీ (తెలుగు) - 4.15 10.20 డెడ్‌పూల్-3డీ(తెలుగు) - 1.40, 7.30
స్క్రీన్-3	డెడ్‌పూల్ - 3డీ (తెలుగు) - 10.40 10.40, డెడ్‌పూల్ - 3డీ (ఇంగ్లీష్) - 4.45 కల్కి-2898 2డీ(తెలుగు) -1.20 7.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	డెడ్‌పూల్-3డీ(తెలుగు)-11.15,1.15 డెడ్‌పూల్-3డీ(ఇంగ్లీష్)-4.15,7.15, 10.15
స్క్రీన్-2	కల్కి 2898 ఏడీ(తెలుగు)- 11.20 6.15 రాయన్(తెలుగు)- 3.05 10.00
స్క్రీన్-3	బాడ్ న్యూజ్ (హిందీ)-10.00,4.15, 10.30 పురుషోత్తముడు(తెలుగు)- 1.05,7.20
స్క్రీన్ -4	రామ్ ఎన్ఆర్ఐ(తెలుగు)-10.10 గల్లీ గ్యాంగ్‌స్టార్స్(తెలుగు)- 1.00 ట్విస్టర్స్(ఇంగ్లీష్)-4.20 రాయన్(తెలుగు)- 7.10 పురుషోత్తముడు(తెలుగు)-10.20
దేవి	రాయన్ (తెలుగు)
నటరాజ్	డెడ్‌పూల్ (తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)

నిండని చెరువులు.. నిరాశలో రైతులు

- నీళ్లు పోయని బోర్లు
- సిరికొండ మండలంలో దుస్థితి



నీళ్లు లేక బోసిపోయిన కప్పలవాగు



వెలవెలబోతున్న సిరికొండ ఎల్లమ్మ చెరువు

సిరికొండ: ప్రస్తుత వర్షాకాలంలో సరిపడ వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు నిరాశలో ఉంటున్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్నా సిరికొండ మండలంలో మాత్రం అంతంతే కురుస్తున్నాయి. గత వారం రోజుల నుంచి కేవలం ముసురు వాన తప్ప భారీ వర్షాలు కురవడం లేదు. ప్రస్తుతం భూగర్భ జలాలు గణనీయంగా అడుగంటిపోయాయి. వానలు కూడా సరిగా కురవకపోవడంతో గతంలో ఎప్పుడు కూడా ఎత్తిపోని బోర్లలో ఈసారి నీళ్లు అడుగంటిపోయాయి. మండలంలోని చెరువులు, వాగులు జలకళ లేక బోసిపోయాయి. మండలానికి వరప్రదాయనిగా ఉన్న కప్పలవాగులో ఇసుక దిబ్బలే దర్శనమిస్తున్నాయి. ఈక్రమంలో వరి నాట్లు మందకొడిగా సాగుతున్నాయి. బోరుబావుల ద్వారా నీటి లభ్యత ఉన్న భూముల్లో మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. సగం మేర కూడా వరి నాట్లు వేయకపోవడంతో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. గత నెలలో ఆరుతడి పంటలైన సోయాబీన్, మొక్కజొన్న విత్తే సమయంలో కూడా వర్షాలు కురవకపోవడంతో ఒక్కో రైతు రెండు మూడుసార్లు విత్తనాలు వేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. విత్తనాలు వేసిన తర్వాత వర్షాలు కురవకపోవడంతో అవి మొలకెత్తలేదు. దీంతో మళ్లీ విత్తనాలను వేసుకున్నారు. దీని వల్ల అన్నదాతలపై ఆర్థికంగా భారం పడింది. గత పదిహేను రోజుల క్రితం గడ్కోల్‌లో ఓ రైతు వరి నారుకు బోరులో నుంచి నీళ్లు రాకపోవడంతో ట్యాంకర్ ద్వారా నీళ్లు పెట్టాడు. నారు పారించడానికై న మోటారు నడిపిస్తే నీళ్లు మానుకుంటు వస్తుండటంతో మోటార్లు కాలిపోతున్న దుస్థితి నెలకొంది. వరి నార్లు ముదిరిపోతుండటంతో పంట దిగుబడి తగ్గే అవకాశాలుంటాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రాజెక్టులు కాని, కాలువలు కాని లేకపోవడంతో అన్నదాతలకు సాగునీటికి అవస్థలు తప్పడం లేదు. ప్రతి ఏడాది యాసంగి సీజన్‌లో భూగర్భజలాలు తగ్గిపోయి వరిపొలాలు ఎండిపోతున్నాయి. మండలంలో సాగు నీటి కష్టాలు తీర్చడానికి పాలకులు ఏమాత్రం చొరవ చూపకపోవడం పట్ల అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండు సార్లు విత్తాను..



వర్షాలు సరిగా కురవకపోవడంతో సోయాబీన్ విత్తనాలను రెండు సార్లు విత్తాల్సి వచ్చింది. బోర్ల నుంచి కూడా నీళ్లు రావడం లేదు. మా ఊరి పక్క నుంచి వెళుతున్న కప్పలవాగు పారితేనే మాకు నీటి లభ్యత ఉంటుంది. జూలై నెల అయిపోవస్తున్నా మాకు ఇంత వరకు ఒక్క భారీ వర్షం పడలేదు. వాగు పారకపోవడంతో బోర్లు నీళ్లు పోయక వరి నాట్లు ఇంకా వేయలేదు.

– భాస్కర్‌రెడ్డి, రైతు, గడ్కోల్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	160
	(కిలోకు)	లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,200	వెండి (కిలో)	87,500
22 క్యారెట్స్	66,600	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	35	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	60	90	గోబీగడ్డ	20	40
కాకరకాయ	35	50	గోబిపువ్వు	20	40
వంకాయ	25	50	బీట్‌రూట్	30	50
పాలకూర	50	75	కరివేపాకు	40	60
మెంతికూర	60	80	చామగడ్డ	40	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	60	90	చిక్కుడుకాయ	45	70
క్యాప్సికం	50	75			

– సుభాష్‌నగర్

సంక్షిప్తం

నేడు దివ్యాంగులకు బస్‌పాస్‌లు

సిరికొండ: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం దివ్యాంగులకు బస్‌పాస్‌లను పంపిణీ చేయనున్నట్లు ఆర్టీసీ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. బస్ పాస్‌లు కావాల్సిన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫోటో తీసుకొని రావాలని తెలిపారు.

ప్రధాన నగరాల్లో డ్రైయినేజీ వ్యవస్థ అధ్వానం

ఖలీల్‌వాడి: దేశంలోని ప్రధాన నగరాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారిందని, దీంతో చిన్నపాటి వర్షాలకు ఆయా నగరాలు జలమయం అవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు కొత్తగా నిర్మించుకునే అపార్టమెంట్, చిన్న పరిశ్రమలకు ఇష్టారీతిన అనుమతి ఇవ్వడంతో నాలాలు, పెద్దపెద్ద డ్రైయినేజీలు మూసుకుపోయి, చిన్న డ్రెయినేజీలుగా మారడంతో ఇలాంటి పరిస్థితి వస్తుందని ఒక ప్రకటనలో ఆరోపించారు. ఢిల్లీలోని ఓ బిల్డింగ్‌లో ఇటీవల ముగ్గురు సివిల్స్ ఆశావాహులు జల సమాధి కావడం బాధాకరమని, ఈ ఘటనకు కారకులైన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్‌కు సన్మానం



సుభాష్‌నగర్: నగరంలోని డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ గంగాధర్ త్వరలో పదవీ విరమణ పొందనున్నారు. ఈసందర్భంగా గంగాధర్ దంపతులను సోమవారం తన సహచర 1996 గ్రూప్-4 బ్యాచ్ సభ్యులు సన్మానించారు. అనంతరం బ్యాచ్ సభ్యుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అనుపాల రవీందర్, తహసీల్దార్ అనిల్, ఎంపీడీవోలు లక్ష్మణ్, రాములు నాయక్, జిల్లా ఆడిట్ ఆఫీసర్ నార్యా, దేవిసింగ్, సీపీవో కార్యాలయ సూపరింటెండెంట్ రాజయ్య, ఎఫ్ఆర్ఓ పద్మారావు, సీనియర్ అసిస్టెంట్ సహదేవ్, ఉద్యానవనశాఖ సూపరింటెండెంట్ శివరాజ్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాలు అందజేత



నిజామాబాద్‌అర్బన్: న్యాల్‌కల్ రోడ్‌లోని ప్రభుత్వ సమీకృత సంక్షేమ బాలుర హాస్టల్‌లో సోమవారం డీసీఈబీ కార్యదర్శి, డిచ్‌పల్లి హెచ్‌ఎం సీతయ్య భారత రాజ్యాంగ ప్రవేశిక అనే పుస్తకాలను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాములు ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. దుబ్బ పీజీ హెచ్‌ఎం గంగయ్య, చింతకుంట పీజీ హెచ్‌ఎం మధుసూదన్, శంకర్ భవన్ ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లేష్, కోట గల్లి స్కూల్ హెచ్‌ఎం రామచందర్ గైక్వాడ్, మోడల్ స్కూల్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.